క్లుప్తంగా

విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకోవాలి



మాట్లాడుతున్న ప్రజాప్రతినిధులు, టీచర్లు

సుల్తానాబాద్‌రూరల్: విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకుని మంచి భవిష్యత్ నిర్మించుకోవాలని సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షురాలు వీరగొని సుజాత అన్నారు. సుల్తానాబాద్ మండలం గర్రెపల్లిలోని సాంఘిక సంక్షేమ గురుకులంలో వేసవి శిక్షణ శిబిరం ఏర్పాటుచేయగా శనివారం ముగింపు సమావేశాన్ని ప్రిన్సిపాల్ అరుణశ్రీ అధ్యక్షతన నిర్వహించారు. శిక్షణలో భాగంగా విద్యార్థులకు లైఫ్‌స్కిల్స్, పబ్లిక్ స్పీకింగ్, థియేటర్ ఆర్ట్స్, మ్యాథ్స్ అంశాలపై తర్ఫీద్ ఇచ్చినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. ఎంపీటీసీ పులి అనూష, తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్ పీర్ అధికారుల బృందం పర్యటన



ఎరువుల తయారీని పరిశీలిస్తున్న అధికారులు

జూలపల్లి: స్వచ్ఛ సర్వేక్షణ్ 2023లో భాగంగా శనివారం మండలకేంద్రంలో పీర్ మండలస్థాయి అధికారుల బృందం పర్యటించింది. ఈ సందర్భంగా 2023 సెల్ఫ్ అసెస్‌మెంట్ చేసుకున్న పనులు మరుగుదొడ్లు, కంపోస్ట్ ఎరువుల తయారీ, ఇంకుడు గుంతలను పరిశీలించి వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశారు. ఎంపీడీవో వేణుగోపాల్‌రావు, ఏపీవో సదానందం, సర్పంచ్ నర్సింహయాదవ్, కార్యదర్శులు లచ్చయ్య, ఐకేపీసీసీ జ్యోతి, వీఏవోలు ఉన్నారు.


కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

గోదావరిఖని: సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు కనీసవేతనాలు అందించాలని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా నాయకుడు రాష్ట్ర మంత్రి కేటీఆర్‌ను కోరారు. శనివారం యూనియన్ కార్యాయంలో జిల్లాకమిటీ సమావేశం నిర్వహించి మాట్లాడారు. మంత్రి ఈప్రాంత పర్యటనకు వస్తున్న నేపథ్యంలో కాంట్రాక్టు కార్మికుల సమస్యలపై స్పందించాలని లేఖ విడుదల చేశారు. సింగరేణి వ్యాప్తంగా 25వేల మంది కాంట్రాక్టు కార్మికులు పనిచేస్తున్నారని, వారందరికీ కనీస వేతనాలతో పాటు, చట్టబద్ధ హక్కులు కల్పించాలన్నారు. ఎన్టీపీసీ తెలంగాణప్లాంట్, ఆర్ఎఫ్‌సీఎల్, కేశోరాం ఫ్యాక్టరీల్లో స్థానికులకే ఉద్యోగాలు ఇవ్వాలన్నారు. కార్మిక కుటుంబాలకు పరిశుభ్రమైన తాగునీరందించాలన్నారు. నాయకులు జూపాక శ్రీనివాస్, గుజ్జుల సత్యనారాయణరెడ్డి, రమేశ్, వెంకన్న పాల్గొన్నారు.


శివపార్వతుల కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న ప్రజాప్రతినిధులు

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని పందిల్ల శ్రీ సాంబమూర్తి అంజనేయ సహిత శివాలయంలో శనివారం ఆలయం 33వ వార్షికోత్సం భక్తుల కోలాహలంతో అంగరంగ వైభవంగా సాగింది. అర్చకుడు సాంబయ్య శివపార్వతుల కల్యాణం ఘనంగా నిర్వహించారు. వధూవరుల తరఫున రావికోటేశ్వర్, గులుభం శ్రీనివాస్ దంపతులు పట్టువస్త్రాలు,పుస్తె,మెట్టెలు తెచ్చారు. మహిళలు మంగళహారతులతో వచ్చి ఓడి బియ్యం, సారెచీర, కట్నకానుకలు సమర్పించారు. భక్తులకు అన్నదానం చేశారు.

విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు



సుల్తానాబాద్‌రూరల్: మండలంలోని గట్టెపల్లిలో శ్రీనాగలింగేశ్వర సామి నూతన విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ ఉత్సవాల్లో భాగంగా శనివారం దేవతా పూజ, చండీ రుద్రహవనంపూజలు పండితులు మల్లావఝుల రత్నాకర్‌శర్మ నిర్వహించారు. ఆదివారం విగ్రహ ప్రతిష్ఠాపన(ప్రాణ ప్రతిష్ఠాపన)ను ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు పాల్గొని పూజలు చేశారు. బ్లాక్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దామోదర్, నాయకులు ప్రకాశ్‌రావు, ఆలయకమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నోరూరిస్తున్న ఆవకాయ పచ్చడి

- మొదలైన పచ్చళ్ల తయారీ సీజన్
- వేడివేడి అన్నంలో మామిడి పచ్చడి తోడైతే భోజనం సంపూర్ణం
- ఇంట్లో కూరలేపోయినా.. మామిడి పచ్చడుంటేచాలు
- సంపన్నులు సైతం ఇష్టపడుతున్న మామిడి పచ్చళ్లు
- బృందాలుగా ఏర్పడి పచ్చళ్లు తయారు చేస్తున్న మహిళలు





పచ్చడి ప్రియులు ఎంతగానో ఎదురుచూసే పచ్చి మామిడికాయలు మార్కెట్లోకి వచ్చేశాయి. దీంతో జిల్లాలో మొదలైన పచ్చళ్ల సందడి ప్రతీ ఇంట్లో కనిపిస్తుంది. మహిళలు, గృహిణులు, వ్యాపారులు నోరూరించే విధంగా పచ్చళ్లను తయారు చేసే పనిలో నిమగ్నమయ్యారు.

సండే స్పెషల్

కోల్‌సిటీ(రామగుండం): ఆవకాయ(మామిడికాయ) పచ్చడి.. ఆ పేరు వింటేనే నోరూరుతోంది కదూ.. పచ్చళ్ల సీజన్ మొదలవడంతో గృహిణులు, వ్యాపారులు వీటి తయారీకి సిద్ధమవుతున్నారు. ఈ వేసవి మామిడికాయ పచ్చడికి ప్రత్యేకం కావడంతో ఆవకాయ పచ్చడి తయారీకి కావాల్సిన పదార్థాలను సేకరించే పనిలో లీనమయ్యారు. పచ్చళ్ల తయారీకి కుటుంబ సభ్యుల సహకారంతో పాటు చుట్టుపక్కల ఇళ్లలోని మహిళల సాయం తీసుకుంటున్నారు. ఏడాదికి సరిపడా పచ్చడి తయారు చేసి నిల్వపెట్టుకుంటున్నారు. అంతేకాకుండా కొంతమంది వ్యాపారులు తమ ఇంటి అవసరాలతోపాటు పచ్చళ్లు పెట్టి విక్రయించేవారికీ ఇది సమయం కావడంతో నిల్వపచ్చడి పెట్టుకునేవారు తోటలు, మార్కెట్‌ల చుట్టూ తిరిగి మంచి కాయలు కొనుగోలు చేసే పనిలో నిమగ్నమయ్యారు. అందుకే అవకాయ పచ్చడి సందడి సందడి చేస్తోంది.

గోదావరిఖనిలో పచ్చళ్ల సందడి ...

గోదావరిఖనిలో మామిడికాయ పచ్చళ్ల తయారీ సందడి ఎక్కువగా ఉంది. రుచికరమైన పచ్చడి తయారీకి గోదావరిఖని పవర్‌హౌజ్‌కాలనీలో ఉమన్ పవర్ కమిటీ ఆధ్వర్యంలో సుమారు 20 మంది మహిళలు ఒకే వేదికపై కలుసుకున్నారు. పచ్చడి తయారీకి నగదు పోగేసుకున్నారు. కాలనీలోని సింగరేణి సేవా సమితి కార్యాలయంలో మామిడి చెట్టుకు కాసిన పుల్లటి మామిడి కాయలను తెంపి, సమష్టిగా రుచికరమైన పచ్చడి తయారు చేసుకున్నారు. రెండు కిలోల చొప్పున పచ్చడిని ఒక్కో కుటుంబానికి పంపిణీ చేసుకున్నారు. ఈ కాలనీలో మహిళలు తయారు చేసిన పచ్చడి రుచిచూసిన స్థానికులు ఆహా.. ఏమి రుచి... అంటూ లొట్టలేసుకుంటున్నారు.

ధరలు పెరిగినా.. తగ్గని డిమాండ్..

మామిడికాయ పచ్చడిలేని ఇల్లు ఉండదంటే అతిశయోక్తి కాదు. ఈ పచ్చడికి ఉన్న ప్రత్యేకతే వేరు. ఈ మధ్య కాలంలో యూట్యూబ్‌లో వీడియోలు చూసి చాలామంది ఇళ్లలోనే పచ్చడి చేసుకుంటున్నారు. గతంలో కంటే కాస్త ధరలు ఎక్కువగా ఉన్నా వాటికి, ఏమాత్రం డిమాండ్ తగ్గడం లేదు. మహిళలు మార్కెట్‌కు వచ్చి వాటిని కొనుగోలు చేసి వారివద్దే ముక్కలు కట్‌చేసుకుని తీసుకెళ్తున్నారు.



మామిడి పచ్చడికి అన్నం తోడైతే.. భోజనం సంపూర్ణం...

ఇళ్లలో మామిడికాయ పచ్చడి తయారు చేసేందుకు అందరూ బిజీగా ఉన్నారు. పెళ్లిళ్లు, పేరంటాలు. ఇంట్లో ఏ కార్యం జరిగినా అక్కడ మామిడికాయ పచ్చడి ఉండాల్సిందే. పప్పులో ఉప్పు తగ్గినా.. కూరలో కారం తగ్గినా.. మామిడికాయ పచ్చడి తోడైతే భోజనం సంపూర్ణంగా ముగిసినట్లే. ఇంట్లో కూర లేకపోయినా భోజనంలో మామిడికాయ పచ్చడి ఉంటే చాలు...కడుపునిండా తినేస్తారు.

ఏ ఇంట్లోనైనా మామిడి పచ్చడి ఉండాల్సిందే



పచ్చళ్లల్లో మామిడి పచ్చడి రుచి వేరు. ఏ ఇంట్లోనైనా మామిడి కాయ పచ్చడి ఉండాల్సిందే. మా పవర్ హౌజ్‌కాలనీలోని ఉమన్ పవర్ కమిటీ ఆధ్వర్యంలో 20 కుటుంబాలం కలిసి పచ్చడి తయారు చేసుకున్నాం. పచ్చడి చాలా సూపర్ టేస్ట్‌గా కుదిరింది. ఇలా తయారు చేసుకున్న పచ్చడిని అందరం పంచుకున్నాం.

– సరిత, గోదావరిఖని.

మంచి అనుభూతి...



మామిడికాయ పచ్చడిని మహిళంతా ఒకేచోట కలిసి తయారు చేసుకోవడం మంచి అనుభూతినిచ్చింది. చెట్టు నుంచి మామిడికాయలను కోయడం నుంచి మొదులు, పచ్చడి తయారు చేసేవరకు అందరు కలిసి పని చేశారు. ఇందులో నేను కూడా పాల్గొడం ఆనందంగా ఉంది. ఈ ఆనవాయితీని ఇలాగే ప్రతీ ఏడాది కొనసాగిస్తాం.

– మూల విజయారెడ్డి, స్త్రీ, శిశు, సంక్షేమ శాఖ జిల్లా కోఆర్డినేటర్.

సంపన్నులు సైతం..

పేద, మధ్యతరగతి వారి ఇళ్లలోనే ఎక్కువగా మామిడిపచ్చడి ఉంటుందనేది ఒకప్పటి మాట. కానీ ఇప్పుడు సంపన్నులు సైతం మామిడి పచ్చడికి జైకొట్టని వారుండరు. తీపి ఆవకాయ, తురుము ఆవకాయ, నువ్వుల ఆవకాయ, అల్లం ఆవకాయ, మెంతి ఆవకయా, మాగాయ అంటూ చాలా రకాల ఆవకాయ పచ్చళ్లు ఉంటాయి. ఎక్కువగా ఇష్టపడేవి మామిడికాయ పచ్చడి మాత్రమే. వేసవిలో వచ్చే పుల్లటి మామిడితో తయారు చేసుకుని ఏడాదంతా నిల్వ చేసుకుంటారు.

ఈద్ మిలాప్...



మాట్లాడుతున్న వక్తలు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లిలోని ఫారన్ మోడల్‌స్కూల్ ఆవరణలో శనివారం ఈద్‌మిలాప్ కార్యక్రమం నిర్వహించారు. జమాతే ఇస్లాం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో వక్తలు రంజాన్ పర్వదిన విశిష్టత తదితర అంశాలపై మాట్లాడారు. మానవులంతా ఒక్కటేనని అందరూ సోదరభావంతో మెలగాలని ఖురాన్ బోధిస్తోందని అబ్దుల్ బాసిత్ అన్నారు. జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ జావీద్, శానవాజ్, మీర్జా అహ్మద్‌బేగ్, రమణారావు, కావేటి రాజ్‌గోపాల్, మూర్తి, మతీన్, ఖలీల్ తదితరులున్నారు.

టార్పాలిన్ కవర్లు పంపిణీ



టార్పాలిన్ కవర్లు అందిస్తున్న రెడ్‌క్రాస్ సభ్యులు

పెద్దపల్లిరూరల్: రైతులు కొనుగోలు కేంద్రాల్లో పోసిన ధాన్యం తడవకుండా ఉండేందుకు వీలుగా రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం పెద్దపల్లి పట్టణ శివారు చందపల్లిలో టార్పాలిన్లు పంపిణీ చేశారు చిన్న, సన్నకారు రైతులకు తమవంతుగా టార్పాలిన్లను అందించినట్లు రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా కన్వీనర్ రాజ్‌గోపాల్,కార్యదర్శి సాదుల వెంకటేశ్వర్లు,సభ్యులు రాంచంద్రారెడ్డి, మూర్తి ఉన్నారు.

ఉద్యోగ విరమణ సన్మానం



సన్మానిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

యైటింక్లయిన్‌కాలనీ: సింగరేణి సంస్థలో 30 ఏళ్ల పనిచేసి ఏప్రిల్ 30న ఉద్యోగ విరమణ పొందిన ఆర్జీ–2 బ్రాంచ్ వైస్‌ప్రెసిడెంట్ అన్నారావు దంపతులను శనివారం యైటింక్లయిన్‌కాలనీ యూనియన్ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఏఐటీయూసీ పార్టీ అభివృద్ధికి ఎంతో కృషిచేశారని పేర్కొన్నారు. ఏఐటీయూసీ డిప్యూటీ జనరల్ సెక్రెటరీ వైవీ.రావు, బ్రాంచ్ కార్యదర్శి రాజారత్నం, శ్యాంసన్, సాంబశివరావు, బుర్ర తిరుపతి పాల్గొన్నారు.

కార్మికుల హక్కుల పరిరక్షణే ధ్యేయం



గేట్ మీటింగ్‌లో మాట్లాడుతున్న సత్తయ్య

గోదావరిఖని: సింగరేణి కార్మికుల హక్కుల పరిరక్షణే ధ్యేయంగా బీఎంఎస్ పోరాటం చేస్తోందని యూనియన్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య పేర్కొన్నారు శనివారం జీడీకే–2వ గనిపై ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్ మాట్లాడారు. బీఎంఎస్ కార్మికుల పక్షాన పోరాటం చేస్తుందన్నారు. నాయకులు ఆకుల హరిఔ్, వై.సారంగపాణి, మాదాసు రవీందర్, బోడకుంటరాజేశం, పోతరాజు భాస్కర్, వెంకటరాజం, శ్రీనివాస్, నరసింహులు, రంజిత్‌కుమార్ పాల్గొన్నారు.

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

గోదావరిఖని: స్థానిక విఠల్‌నగర్‌కు చెందిన బంగారు వినయ్‌కుమార్(39) శనివారం ఉరివేసుకుని మృతిచెందాడు. ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతూ తన ఇంట్లో సీలింగ్‌ఫ్యాన్‌కు ఉరివేసుకుని అఘాయిత్యానికి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. మృతుని భార్య ఫి ర్యాదుతో ఎస్సై రమేశ్ కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నారు.

సదాశయ సేవలు అభినందనీయం



ఫౌండేషన్ ప్రతినిధులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే

కోల్‌సిటీ: నేత్ర, అవయవ, శరీర దానంపై సదాశయ ఫౌండేషన్ చేస్తున్న సేవలు అభినందనీయమని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. రామగుండం ప్రభుత్వ మెడికల్ కళాశాలలో శుక్రవారం రాత్రి నిర్వహించిన ఎంబీబీఎస్ విద్యార్థుల ఫ్రెషర్స్‌డే వేడుకల్లో ఎమ్మెల్యే చందర్ పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా సదాశయ ఫౌండేషన్ సేవలను కొనియాడుతూ, వేదికపై ఫౌండేషన్ ప్రతినిధులు లింగమూర్తి, నూక రమేశ్, కే.ఎస్.వాసును శాలువాలు, అభినందన పత్రాలు, జ్ఞాపికలు అందించి సన్మానించారు. మెడికోల వైద్య పరిశోధనలకు రెండు పార్థివ దేహాలను మెడికల్ కళాశాలకు సదాశయ ఫౌండేషన్ దానం చేయించడం గొప్ప విషయమన్నారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ ప్రతినిధులతోపాటు పార్థివ దేహాలను దానంచేసిన వారి కుటుంబాలను ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో మేయర్ డాక్టర్ అనిల్‌కుమార్, కార్పొరేటర్ కృష్ణవేణి, ప్రిన్సిపాల్ హిమబిందుసింగ్, వైస్ ప్రిన్సిపాల్ నరేందర్, అనాటమీ విభాగం హెచ్ఓడీ రాహుల్ హెగ్డే పాల్గొన్నారు. ఎమ్మెల్యేకు ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రవణ్‌కుమార్, ప్రతినిధులు సానా రామకృష్ణారెడ్డి, డాక్టర్ భీష్మాచారి, రాజమౌళి, చంద్రమౌళి, అన్నపూర్ణ, చందు, అనంతరాములు, కవిత, కృతజ్ఞతలు తెలిపారు.

రాబోయే ఎన్నికల్లో బీఎస్పీ గెలుపు ఖాయం



బీఎస్పీలో చేరిన వారితో ఇన్‌చార్జి ఉష

ఓదెల: రాబోయే ఎన్నికల్లో పెద్దపల్లిలో బీఎస్పీ గెలుపు ఖాయమని బీఎస్పీ పెద్దపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి ఉష పేర్కొన్నారు. శనివారం ఓదెల మండలం పొత్కపల్లి గ్రామంలో బీఎస్పీలో కుమారస్వామి, మహ్మద్‌పాషా, పర్లపల్లి శ్రావణ్, రెడ్డి శ్రావణ్, కొక్కుల వేణు, భగవత్ కృష్ణ, సదానందం, తిరుపతి, తాళ్లపల్లి గణేశ్, కొంరయ్య, రమేశ్ తో పాటు 50మంది బీఎస్పీలో చేరారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తెలంగాణలో బీఎస్పీ అధికారంలోకి వస్తే విద్య, వైద్యం, ఉపాధి విషయాల్లో లాభం చేకూరుతుందన్నారు. పెద్దపల్లి నియోజకవర్గంలో యువతి, యువకులు బీఎస్పీ వైపు మొగ్గుచూపుతున్నారన్నారు. బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో తెలంగాణలో పార్టీ బలపడుతోందన్నారు. బీఎస్పీ నియోజకవర్గ కోశాధికారి రియాజ్, నాయకులు మహేశ్, వహిద్, అభిరామ్, వంశీ, మానస, రజిత , అనూష పాల్గొన్నారు.

మేడే వారోత్సవాల ముగింపు



ప్రదర్శన నిర్వహిస్తున్న కార్మికులు, నాయకులు

పెద్దపల్లిరూరల్: కార్మికుల శ్రమదోపిడీకి వ్యతిరేకంగా నిర్వహించిన పోరాటమే మేడే..8 గంటల పనివిధానం కోసం నిర్వహించిన పోరాటంలో ఎంతోమంది కార్మికులు అమరులయ్యారని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముత్యంరావు అన్నారు. మేడే ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో పెద్దపల్లిలో నిర్వహించిన వారోత్సవాలు శనివారం ముగిసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా శనివారం పెద్దపల్లి పట్టణంలోని జెండా కూడలి నుంచి అంబేడ్కర్ కమ్యూనిటీహాల్ వరకు ప్రదర్శన నిర్వహించారు. అసంఘటిత రంగంలోని కార్మికులందరికీ కనీసవేతనం రూ.26వేలకు పెంచి ఉద్యోగభద్రత కల్పించాలన్నారు. నాయకులు జ్యోతి, సతీశ్, భార్గవ్, రవీందర్, అశోక్, ప్రశాంత్, చంద్రయ్య, మరియ, సాయి, దేవమ్మ, విజయ,సుశీల,పద్మ,లక్ష్మి తదితరులున్నారు.

ఘనంగా శ్రీ వేంకటేశ్వరుని కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు, పాల్గొన్న భక్తులు

జూలపల్లి: మండలంలోని కుమ్మరికుంటలో శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం పద్మావతి, అలివేలు మంగ సమేత శ్రీ వేంకటేశ్వరుని కల్యాణం వేదపండితులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తుల మధ్య పద్మావతి, అలివేలు మంగ సమేత శ్రీ వేంకటేశ్వరుని ఉత్సవమూర్తులకు వేద మంత్రాల మధ్య, మాంగళ్యధారణ గావించారు. సర్పంచ్ సంతోశ్‌రావు, ఎంపీటీసీ మల్లేశ్‌యాదవ్, ఉపసర్పంచ్ మల్లేశం, కుంట రాజేశ్వర్‌రెడ్డి, దిడ్డి శంకరయ్య, ఆవుల అనిల్, ప్రవీణ్‌రావు, వెంకట్‌రావు, ఆలయ ప్రధాన అర్చకులు బండవరం రామానుజం, భక్తులు పాల్గొన్నారు.

దళితరత్న అవార్డు గ్రహీతకు సన్మానం



సంపత్‌ను సన్మానిస్తున్న నాయకులు

జ్యోతినగర్: దళితరత్న అవార్డుగ్రహీత రాసపల్లి సంపత్‌ను ఘనంగా సన్మానించారు. శనివారం ఎన్టీపీసీ రామగుండం పీటీఎస్‌లో దళితరత్న అవార్డుగ్రహీత ఎన్టీపీసీ సంస్థ ఉద్యోగి, సీఐటీయూ నాయకుడు రాసపల్లి సంపత్‌ను సీఐటీయూ అనుబంధ ఎన్టీపీసీ యూనైటెడ్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు భూమయ్య అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో శాలువాకప్పి, పుష్పగుచ్ఛం అందించి ఘనంగా సన్మానించారు. యూనియన్ అధ్యక్షుడు బిక్షపతి మాట్లాడుతూ.. సంపత్ చేసిన సేవలకు గుర్తింపుగా దళితరత్న పొందడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కార్యనిర్వాహక అధ్యక్షుడు భూమయ్య, ప్రధానకార్యదర్శి సారయ్య, నాయకులు సాంబయ్య, స్వామి,కుమార్,శంకర్, గణేశ్ పాల్గొన్నారు.

మోటార్ సైకిల్, కారు ఢీ



ప్రమాదంలో గాయపడ్డ సత్యనారాయణ, చిన్నారి

ధర్మారం(ధర్మపురి): ధర్మారం మండల కేంద్రంలోని సాయిమణికంఠ హైస్కూల్ సమీపంలో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. అదే గ్రామానికి చెందిన ఎంపెల్లి సత్యనారాయణ కుటుంబంతో కలిసి శనివారం ఖిలావనపర్తిలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి రథోత్సవానికి వెళ్లారు. తిరిగి ఇంటికొస్తుండగా ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టింది. ఈ సంఘటనలో సత్యనారాయణ, భార్య దేవేంద్రతోపాటు ఇద్దరు మనుమలు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను వెంటనే కరీంనగర్ ఆస్పత్రికి తరలించి, చికిత్స అందిస్తున్నారు.

మేజిస్ట్రేట్ బాధ్యతల స్వీకరణ



గోదావరిఖనిటౌన్: గోదావరిఖని రెండో అదనపు మున్సిఫ్ మేజిస్ట్రేట్‌గా ఇటీవల కామారెడ్డి నుంచి బదిలీపై వచ్చిన డి.వెంకటేశ్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. కోర్టు సిబ్బంది స్వాగతం పలికారు.

వైభవంగా శేషహోమం

ఎలిగేడు: మండలంలోని ముప్పిరితోట శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీమదలమేల్మంగా సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి తిరుక్కల్యాణ మహోత్సవాల్లో భాగంగా శనివారం ఆలయంలో శేషహోమం నిర్వహించారు. ప్రత్యేక పూజలుచేశారు. ఆదివారం నిర్వహించే రథోత్సవం, జాతరకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకోవాలని, భక్తులకు ఎలాంటి ఇబ్బంది లు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.



ఇళ్ల స్థలాల కోసం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులతో గోదావరిఖని వాసులు

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

పెద్దపల్లిరూరల్: ఇళ్లు లేఇన నిరుపేదలకు వెంటనే నివేశన స్థలాలు కేటాయించి పట్టాలందించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి యాకయ్య డిమాండ్ చేశారు. కలెక్టరేట్ ఎదుట శనివారం నిరుపేదలతో కలిసి ధర్నా నిర్వహించారు. సీపీఎం ఆధ్వర్యంలో గత 52 రోజులుగా భూపోరాటం సాగుతోందన్నారు. పేదలకు నివేశన స్థలాలు కేటాయించి కేంద్రం రూ.10లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం రూ.5లక్షలను ఇంటి నిర్మాణం కోసం అందించాలన్నారు. నాయకులు మహేశ్వరి, లావణ్య, ముత్తారావు, రాజకుమార్, శివకుమార్, రవి, శంకర్, మహేందర్ తదితరులున్నారు.

జూన్ 10న మెగా లోక్‌అదాలత్



మాట్లాడుతున్న న్యాయమూర్తి శ్రీనివాసరావు

గోదావరిఖనిటౌన్:లోక్ అదాలత్‌తో సత్వర న్యాయం దక్కుతుందని గోదావరిఖని అదనపు జిల్లా న్యాయమూర్తి టి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. జూన్ 10న జరిగే నేషనల్ మెగాలోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని కోరారు. శనివారం గోదావరిఖని అదనపు జిల్లా న్యాయస్థానంలో సన్నాహక సదస్సు నిర్వహించారు. అదనపు జిల్లా న్యాయమూర్తి మాట్లాడుతూ లోక్ అదాలత్ ద్వారా రాజీపడ్డ కేసుల్లో అప్పీలుకు అవకాశం ఉండదన్నారు. గోదావరిఖని సీనియర్ సివిల్‌జడ్జి రాజ్‌కుమార్, రెండో అదనపు మున్సిఫ్ మేజిస్ట్రేట్ వెంకటేశ్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మేడ చక్రపాణి పాల్గొన్నారు.